
జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com

మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 310 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 24-05-2025 | పేజీలు : 5


# మీకు కనీస కృతజ్ఞత లేదు..



**- సినిమా వాళ్లెవరూ వ్యక్తిగతంగా రావద్దు**

**- డిప్యూటీ సీఎం పవన్**

అమరావతి, మే 24 (జనస్వరం) : తెలుగు చిత్రసీమలో ఉన్నవారికి ఏపీ ప్రభుత్వం పట్ల కనీస కృతజ్ఞత లేదని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అసహనం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది అవుతున్నా తెలుగు సినీ సంఘాల ప్రతినిధులు రాష్ట్రముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వం సినిమా రంగం వారిని, అగ్ర నటులను ఎలా ఛీత్కరించిందో మరిచిపోయారని, కూటమి ప్రభుత్వం వ్యక్తులను కాదు.. సినిమా రంగం అభివృద్ధినే చూస్తుందన్నారు. మీరు ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తానని అన్నారు. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తమ డిమాండ్‌లు నెరవేర్చాలని లేకపోతే, జూన్ 1 నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లు బంద్ అంటూ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు హెచ్చరించిన సంగతి తెలిసిందే. తాజాగా ఫిల్మ్ ఛాంబర్‌లో జరిగిన సమావేశం తర్వాత అలాంటిదేమీ లేదని ప్రకటించిన నేపథ్యంలో పవన్‌కల్యాణ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

**గత ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులు మర్చిపోయారా? :**

"ఆంధ్రప్రదేశ్‌లో సినిమా పరిశ్రమను అభివృద్ధి చేయాలని, ఈ రంగంలో ఉన్నవారి గౌరవమర్యాదలకు భంగం వాటిల్లకుండా చూస్తుంటే తెలుగు సినీ రంగంలో ఉన్నవారికి ప్రభుత్వం పట్ల కనీస మర్యాద, కృతజ్ఞత కనిపించడం లేదు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కావస్తున్నా, ఒక్కసారైనా గౌరవ సీఎం చంద్రబాబును కలవలేదు. కేవలం తమ చిత్రాల విడుదల సందర్భంలో ప్రభుత్వం ముందుకు రావడం మినహా, చిత్ర రంగం అభివృద్ధి కోసం ఒక్కసారి కూడా రాలేదు. 'అందరూ కలిసి రావాలి' అని పిలుపునిచ్చినా సానుకూలంగా స్పందించలేదు. అగ్ర నటులు, సాంకేతిక నిపుణులను గత ప్రభుత్వం ఏ విధంగా ఛీత్కరించుకుందో అందరూ మర్చిపోయారు. నాటి ప్రభుత్వం వ్యక్తులను చూసి పనులు చేసేది. తమకు నచ్చనివారి సినిమాల విడుదల సమయంలో ఎన్ని ఇబ్బందులు పెట్టిందో నిర్మాతలు మరచిపోతే ఎలా"

**ఇక వ్యక్తిగతంగా రావద్దు :**

"ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, అల్లు అరవింద్, డి.సురేశ్ బాబు, వై.సుప్రియ, చినబాబు, సి.అశ్వనీదత్, నవీన్ ఎర్నేని తదితర నిర్మాతలు కలిసినప్పుడు అందరూ సంఘటితంగా ఉంటే పరిశ్రమగా అభివృద్ధి చేయవచ్చు' అని చెప్పాను. అయినా, ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి తమ సినిమాలకు టికెట్ ధరలు పెంచమని సినిమాటోగ్రఫీ శాఖకి అర్జీలు ఇస్తూ వచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తూనే ఉంది. మీరు ఇచ్చిన ఈ రిటర్న్ గిఫ్ట్‌ను తగిన విధంగానే స్వీకరిస్తా. ఇక నుంచి వ్యక్తిగత విజ్ఞాపనలు, చర్చలకు తావులేదు. సంబంధిత విభాగం ప్రతినిధులతోనే చర్చిస్తా. వాటినే సంబంధిత విభాగాలకు పంపిస్తా" అని ఉప ముఖ్యమంత్రి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్ర పరిశ్రమపై తన అభిప్రాయాన్ని ఘాటుగా ప్రకటన రూపంలో తెలియజేశారు.

**రాష్ట్రంలో థియేటర్లు, మల్టీప్లెక్స్‌లపై పవన్‌కల్యాణ్ ఆరా :**

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సినిమా థియేటర్ల నిర్వహణ, ప్రేక్షకులకు అందుతున్న సౌకర్యాలు తదితర అంశాలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యవేక్షణలో సంబంధిత శాఖలతో చర్చించారు. ప్రేక్షకుల నుంచి ప్రభుత్వానికి తరచూ వస్తున్న ఫిర్యాదుల్లో సినిమా హాళ్లలో తినుబండారాలు, పానీయాల ధరలు అత్యధికంగా ఉండటం, మంచి నీళ్ల సదుపాయం కూడా సక్రమంగా లేకపోవడం. వీటిపైనా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నారు. విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, రాజమహేంద్రవరం, గుంటూరు, కాకినాడ, తిరుపతి తదితర నగరాల్లో ఉన్న మల్టీప్లెక్స్‌ల నిర్వహణ వాటిలోని టికెట్ ధరలు, ఆహార పదార్థాల ధరలపై కూడా దృష్టి సారించనున్నారు. సినిమా రూపకల్పన నుంచి వాణిజ్యం వరకూ 24 విభాగాల్లో నైపుణ్యాల పెంపుదల, అధునాతన సాంకేతికత వినియోగంపై ప్రత్యేక దృష్టిపెట్టాలని పవన్‌కల్యాణ్ యోచిస్తున్నారు.

# వరుస బాంబు బెదిరింపు కాల్స్..



**ఉలిక్కిపడ్డ నగరాలు**

**విశాఖపట్నం, మే 24 (జనస్వరం) :** వరుస బాంబు బెదిరింపు కాల్స్‌తో ఇటు విజయవాడ అటు విశాఖ నగరాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. పలు ప్రాంతాల్లో బాంబులు పెట్టామంటూ ఆగంతకుల ఫోన్ కాల్స్‌తో బాంబు స్క్వాడ్, పోలీసులు ఉరుకులు పరుగులు తీశారు. ఆయా ప్రాంతాల్లో బాంబు స్క్వాడ్ విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. చివరకు ఎలాంటి బాంబు ఆనవాళ్లు లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈరోజు (శనివారం) ఉదయం విజయవాడలోని బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టామని, ఆ తరువాత రైల్వేస్టేషన్‌కు బాంబు బెదరింపు కాల్స్ వచ్చాయి. వెంటనే అప్రమత్తమైన పోలీసులు తనిఖీలు నిర్వహించి బాంబు లేదని నిర్ధారించారు. తాజాగా విశాఖ రైల్వేస్టేషన్‌లోనూ బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేసింది. విశాఖ ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు కాల్ రావడంతో తనిఖీలు చేశారు. ముంబై నుంచి విశాఖ వచ్చే ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు ఉన్నట్లు ఆగంతకుడి నుంచి ఫోన్ కాల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎల్టీటీ చివరి స్టాప్ విశాఖ రైల్వే స్టేషన్ కావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైలు మొత్తాన్ని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఎస్ 2 బోగీలో అనుమానిత బ్యాగ్‌ను గుర్తించారు. ఆ బ్యాగ్‌ను కూడా సెర్చ్ చేయగా బట్టలు మాత్రమే కనిపించాయి. దీంతో ఎలాంటి బాంబు లేదని అధికారులు నిర్ధారించారు. ఈ ఆపరేషన్‌లో డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్, సివిల్ పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ బృందాలు కలిసి ట్రైన్‌ను మొత్తాన్ని పరిశీలించారు. ప్రయాణికుల బ్యాగులను కూడా తనిఖీ చేశారు. చివరకు బాంబు లేదని నిర్ధారణకు వచ్చారు. చాలా రష్‌గా ఉన్న ట్రెయిన్‌లో ఇలాంటి కాల్ రావడంతో భయాందోళనకు గురయ్యారు. అయితే బ్యాగును మరిచిపోయిన వ్యక్తి యూపీకి చెందిన శ్రీరామ్‌గా గుర్తించారు. అలాగే ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందనే దానిపై పోలీసులు దృష్టిసారించారు. కాగా.. విజయవాడలో రెండు చోట్ల బాంబులు పెట్టినట్లు అజ్ఞాత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయి. తెల్లవారుజామున కంట్రోల్ రూంకు ఫోన్ చేసిన ఓ వ్యక్తి బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టినట్లు చెప్పి కట్ చేశాడు. బీసెంట్ రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉండే ప్రాంతం. వందలాది మంది వ్యాపారాలు, కొనుగోళ్లు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో బీసెంట్ రోడ్డులో బాంబు పెట్టామంటూ కాల్ వచ్చిన వెంటనే పోలీసులు అలర్ట్ అయి బాంబ్ స్క్వాడ్‌ను రంగంలోకి దించి నాలుగు బృందాలుగా ఏర్పడి అర కిలో మీటర్ వరకు తనిఖీలు చేశారు. ప్రతీ షాపుతో పాటు తోపుడబండ్లను జల్లెడపట్టారు. ఎక్కడా కూడా బాంబు ఉన్న జాడ కనిపించలేదు. దాదాపు నాలుగు గంటల ఆపరేషన్ తర్వాత బాంబు లేదని, ఎటువంటి భయం లేకుండా అందరూ వ్యాపారాలు చేసుకోవచ్చని పోలీసులు తెలిపారు. దీంతో 11 గంటల తర్వాత బీసెంట్ రోడ్డులో వ్యాపార కార్యక్రమాలు మొదలయ్యాయి. బీసెంట్ రోడ్డులో బాంబు లేదని అంతా ఊపిరిపీల్చుకుంటున్న సమయంలో విజయవాడ రైల్వేస్టేషన్‌లో బాంబు కాల్ కలకలం రేపింది. వెంటనే జీఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు, విజయవాడ పోలీసులు బృందాలుగా ఏర్పడి రైల్వేస్టేషన్‌లోని పది ప్లాట్‌ఫాంలను బాంబు స్క్వాడ్‌తో అణువణువునా గాలించారు. చివరకు పార్సిల్ ఆఫీస్‌కు వెళ్లి పరిశీలించినప్పటికీ ఎక్కడా బాంబు ఉన్నట్లు ఆనవాళ్లు లేవని పోలీసులు నిర్ధారించారు. ఉద్దేశపూర్వకంగా కాల్స్ చేసినట్లు తెలుస్తోంది. ఈ రెండు కాల్స్ ఎక్కడి నుంచి వచ్చాయనే దానిపై పోలీసులు విచారణ చేపట్టారు.

## వాట్సాప్‌లో రైస్‌కార్డు సేవలు

**- కార్డులో మార్పుచేర్పులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు**

**- మొత్తం ఎనిమిది రకాల సేవలు అందుబాటులోకి**



**అమరావతి, మే 24 (జనస్వరం) :** రైస్ కార్డులో మార్పుచేర్పులు, ఇతర సేవలకు దరఖాస్తు చేసుకునేందుకు మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) సేవలు శనివారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఇందులో ఎనిమిది రకాల సేవలు ఉన్నప్పటికీ, ప్రధానంగా కొత్త రైస్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకునే ఆప్షన్ లేకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


**ఇలా దరఖాస్తు చేయాలి. :**

మొబైల్ ఫోనులో 'మనమిత్ర' వాట్సాప్ చాట్‌లోకి వెళ్లి 'హాయ్' అని టైప్ చేస్తే 'సేవను ఎంచుకోండి' అని వస్తుంది. దానిని క్లిక్ చేస్తే 'పౌర సేవను ఎంచుకోండి' అనే బాక్స్‌లో 'సివిల్ సప్లయిస్ సేవలు'పై క్లిక్ చేయాలి. 'దీపం' స్థితి, రైస్ డ్రా స్థితి, రైస్ ఈకేవైసీ స్థితి, రైస్ కార్డు సమర్పణ, రైస్ కార్డులో సభ్యులను జోడించడం, రైస్ కార్డులో సభ్యులను తొలగించడం, తప్పుగా జోడించిన ఆధార్ సీడింగ్ సవరణ, రేషన్ కార్డ్ విభజన దరఖాస్తు.. అనే 8 రకాల సేవలు కనిపిస్తాయి. వీటిలో మీకు అవసరమైన సేవను ఎంపిక చేసుకుని.. వివరాలను పూరించి, వాట్సాప్ ద్వారానే దరఖాస్తు చేసుకోవచ్చు.

**జాప్యాన్ని నివారించడానికే.. :**

కొత్త రైస్ కార్డులతో పాటు ఇతర సేవల కోసం ఈ నెల 7నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అయితే భారీసంఖ్యలో దరఖాస్తులు వచ్చిపడుతుండటంతో ఒత్తిడి పెరిగి సర్వర్లు డౌన్ అయిపోవడం, ఇతర సాంకేతిక సమస్యలతో వాటిని ఆన్‌లైన్ చేయడంలో తీవ్రమైన జాప్యం జరుగుతోంది. దీంతో దరఖాస్తుదారులు సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో రైస్ కార్డు దరఖాస్తులు సమర్పించడానికి వీలుగా 'మనమిత్ర' (వాట్సాప్ గవర్నెన్స్) సేవలను ఈ నెల 15 నుంచే అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే సాంకేతికపరమైన కారణాలతో ఈ సేవలను ప్రకటించిన సమయానికి అందుబాటులోకి తీసుకురాలేకపోయారు. ఎట్టకేలకు శనివారం నుంచి వాట్సాప్ గవర్నెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా దరఖాస్తుదారులకు కొంత వెసులుబాటు కల్పించారు.

## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 24 మే 2025,

తిథి : బహుళ ద్వాదశి (రా.07:23వ.కు)

నక్షత్రం : రేవతి (మ.01:50వ.కు)

బ్రహ్మ ముహూర్తం : తె.04:02ల తె.04:50

రాహుకాలం : ఉ.08:52ల ఉ.10:28,

యమగండం : మ.01:41ల మ.03:18,

వర్జ్యకాలం : తె.03:01ల తె.03:05

## ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 24 మే 2025,

ఫజర్ : తెల్లవారుజామున గం. 04:32

సూర్యోదయం : ఉదయం గం. 05:49

జొహార్ : మధ్యాహ్నం గం. 12:17

అసర్ : సాయంత్రం గం. 03:38

మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:44

ఇష : రాత్రి గం. 08:02





జనస్వరం

**విలేకరులు కావలెను**


"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# ఏపీకి మరో రూ.వేలకోట్ల భారీ ప్రాజెక్టు..

**- పొరుగు రాష్ట్రం నుంచి ఇక్కడికి?..**

**- చంద్రబాబు మాస్టర్ ప్లాన్**



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి భారీ పెట్టుబడులు తీసుకొచ్చే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఢిల్లీ పర్యటనలో కేంద్రం ముందు కీలక ప్రతిపాదనలు చేశారు. ఎలక్ట్రానిక్స్, రక్షణ రంగాలలో పెద్ద ఎత్తున పరిశ్రమలు నెలకొల్పడానికి ప్రతిపాదనల్ని కేంద్రమంత్రులకు సీఎం చంద్రబాబు నాయుడు అందజేశారు. రాష్ట్రంలో మరిన్ని సైనిక్ స్కూళ్లు, డీఆర్‌డీఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో జరిగిన సమావేశంలో రాష్ట్రానికి సంబంధించిన పలు డిమాండ్లను ఆయన విన్నవించారు. లేపాక్షి–మడకశిర మధ్య అందుబాటులో ఉన్న 10 వేల ఎకరాల్లో సైనిక, పౌర విమానాల తయారీ, రక్షణ రంగ ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, ఏరోస్పేస్ ఎకో సిస్టం ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు కాంగ్రెస్ పాలిత కర్ణాటక నుంచి హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) అడ్వాన్స్‌డ్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎంసీఏ), లైట్ కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఎల్‌సీఏ) ఉత్పత్తిని తన రాష్ట్రానికి తరలించాలని ప్రతిపాదించారు. బెంగళూరు విమానాశ్రయం నుంచి ఒక గంట సమయం పట్టే దూరంలో ఉన్న.. లేపాక్షి–మడకశిర హబ్‌లో హెచ్ఏఎల్‌కు సంబంధించి ఏఎంసీఏ ఉత్పత్తి సౌకర్యం కోసం 10,000 ఎకరాల భూమిని చంద్రబాబు ప్రతిపాదించారు.. ఈ ప్రాజెక్టు విలువ రూ.వేల కోట్లలో ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్మీ కంటోన్మెంట్ ఏర్పాటు చేయాలని, దక్షిణాదిలో తెలంగాణ, తమిళనాడు, కర్ణాటకల్లో ఉన్నా ఏపీలో లేదన్నారు. కొత్తగా సైనిక్ స్కూళ్లు ఇవ్వాలని, తిరుపతి ఐఐటీలో డీఆర్‌డీఓ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే జగ్గయ్యపేట–దొనకొండ క్లస్టర్‌లో 6 వేల ఎకరాల్లో క్షిపణులు, ఆయుధ సామగ్రి ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. విశాఖపట్నం–అనకాపల్లి క్లస్టర్‌లో నౌకా రంగానికి అవసరమైన పరికరాల ఉత్పత్తి, ఆయుధాల పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. కర్నూలు–ఓర్వకల్లు మధ్య 4 వేల ఎకరాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని, అక్కడ సైనిక డ్రోన్లు, రోబోటిక్స్, ఆధునిక రక్షణ పరికరాల తయారీ కేంద్రం ఏర్పాటు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగంలోని రక్షణ పరిశ్రమల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో వాటి క్లస్టర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అనంతపురం జిల్లా పాలసముద్రంలోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌ను వేగంగా పూర్తి చేయాలని, మిధాని–నాల్కో ఆధ్వర్యంలో నెల్లూరులో 60 లక్షల టన్నుల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంతో అల్యూమినియం ఉత్పత్తి ప్లాంట్‌ను త్వరగా ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. బెంగళూరు–హైదరాబాద్ కారిడార్‌లో లేపాక్షి–ఓర్వకల్లు మధ్య ఎలక్ట్రానిక్ సిటీ రాబోతుందున్నారు. త్వరలోనే ఎంవోయూ చేసుకుంటామని తెలిపారు. మూడు నెలల్లో సిటీ నిర్మాణ పనులు మొదలుపెట్టాలని చెప్పామని, భూకేటాయింపులు త్వరగా పూర్తి చేసి ముందడుగు వేస్తామన్నారు. ఎలక్ట్రానిక్ సిటీ నిర్మాణంలో యాపిల్‌తో పాటు ఇతర ఉత్పత్తిదారులు కూడా భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. ఈ సిటీకి కావలసిన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందని, ఉద్యోగాల కల్పన, అభివృద్ధి బాధ్యత ఆయా సంస్థలదేనన్నారు. లేపాక్షి–ఓర్వకల్లు మధ్య పరిశ్రమల స్థాపనకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని సీఎం అన్నారు. బెంగళూరు, పుట్టపర్తి, ఓర్వకల్లు, హైదరాబాద్ విమానాశ్రయాలు దగ్గరలో ఉండటం, కృష్ణపట్నం పోర్టు అందుబాటులో ఉండటం కలిసొచ్చే అంశాలన్నారు. ఇక్కడ మరో విమానాశ్రయం వచ్చే అవకాశం ఉందని, దీనివల్ల రక్షణ రంగ సంస్థలు కూడా ఎక్కువగా వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఓర్వకల్లులో సైన్యానికి, వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే డ్రోన్లు తయారు చేస్తామని, దీనిని దేశానికి ఒక హబ్‌గా తయారు చేస్తామన్నారు. కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి జితేంద్రసింగ్‌ను కలిసి శ్రీహరికోట వద్ద స్పేస్‌సిటీ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రం సమీపంలోనే 2 వేల ఎకరాల్లో క్లస్టర్ ఏర్పాటు చేసి ప్రైవేటు ఉపగ్రహాల తయారీ, ప్రయోగ కేంద్రాన్ని నిర్మిస్తామన్నారు.

## ఎడిటోరియల్



జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

## కడప ఉక్కు ప్లాంట్‌పై మహానాడులో తీర్మానం తీసుకోవాలి

**తులసిరెడ్డి, ఈశ్వరయ్య డిమాండ్**



**పులివెందుల, మే 24 (జనస్వరం) :** టీడీపీ మహానాడు సమావేశాల్లో కడప ఉక్కు కర్మాగారం నిర్మాణంపై స్పష్టమైన ప్రకటన చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. శనివారం కడప ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఉక్కు కర్మాగారం అంశంపై సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కడప సహా రాయలసీమ జిల్లాల్లో నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉండగా, కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం ఆ సమస్యకు పరిష్కారమని స్పష్టం చేశారు. కర్మాగారం నిర్మాణానికి అవసరమైన అన్ని వనరులు, భూమి, నీరు, విద్యుత్, రవాణా, ఖనిజాలు అన్నీ సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఎర్రగుంట్ల, కమలాపురం మండలాల్లో సున్నపు రాయి, పెండ్లిమర్రి, వేముల మండలాల్లో డోలమైట్, కడప, అనంతపురం, ప్రకాశం, బళ్లారి జిల్లాల్లో మాగ్నటైట్ నిల్వలున్నాయని వివరించారు. 2007లో అప్పటి సీఎం డా. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అంబవరం వద్ద బ్రహ్మణి స్టీల్ ప్లాంట్ కోసం శంఖుస్థాపన చేసినా, యాజమాన్య అవకతవకలతో పనులు నిలిచిపోయాయని గుర్తుచేశారు. విభజన చట్టంలో సెయిల్ ద్వారా కడపలో ఉక్కు కర్మాగారం నిర్మాణాన్ని స్పష్టంగా పేర్కొనినప్పటికీ, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మోసగించిన తీరుతోపాటు రాష్ట్రాల్లో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల అసమర్థత వల్ల ఇప్పటికీ నిర్మాణం మొదలుకాలేదన్నారు. 2018లో మైలవరం మండలంలోని కంబాలదిన్నె వద్ద చంద్రబాబు నాయుడు 3892 ఎకరాలలో శంఖుస్థాపన చేసినా, పనులు మొదలుకాలేదన్నారు. 2019లో జగన్‌మోహన్ రెడ్డి జమ్మలమడుగు మండలం సున్నపు రాళ్లపల్లిలో 3200 ఎకరాలలో మరోసారి శంఖుస్థాపన చేసి, 2023లో మళ్లీ అదే పనిని పునరావృతం చేసినా, ఒక్క అడుగు ముందుకు వేయలేదని విమర్శించారు. "అంగట్లో అన్నీ ఉన్నా, అల్లుడి నోట్లో శని" అన్నట్లుగా ప్రస్తుతం కడప యువత నిరాశతో ఉన్నారని తెలిపారు. ఇప్పుడు కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ డబులింజన్ ప్రభుత్వాలున్నాయని, టీడీపీ మద్దతుతోనే మోదీ ప్రభుత్వం నడుస్తున్న నేపథ్యంలో ఇది కడప ఉక్కు కర్మాగారం కోసం అనువైన సమయమని అన్నారు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ నిప్పాన్ స్టీల్ లిమిటెడ్ సంస్థ 17.8 మిలియన్ టన్నుల సామర్థ్యంతో లక్ష ఉద్యోగాల లక్ష్యంతో ఉక్కు కర్మాగారం నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో, కడప జిల్లాలోనూ అలాంటి ప్రాజెక్టును తెచ్చేందుకు టీడీపీ మహానాడులో గట్టిగా తీర్మానం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇది సెయిల్ ద్వారా కావచ్చు, ప్రైవేట్ భాగస్వామ్యంతో కావచ్చు, లేదా రెండింటి మేళవింపుతో కావచ్చు కానీ, నిర్మాణం జరగాల్సిన అవసరాన్ని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, శాసన మండలి మాజీ సభ్యుడు కత్తి నరసింహారెడ్డి, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివతో పాటు వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

## బయోమెట్రిక్ ద్వారా డ్వాక్రా రుణాలు



**పులివెందుల మే 24 (జనస్వరం) :** జీవనోపాదుల ప్రణాళిక అమలులో భాగంగా 2025–26 సంవత్సరం ఆర్థిక వనరుల మంజూరుకు సంఘం సూక్ష్మ రుణ ప్రణాళిక తయారీలో భాగంగా ప్రతి డ్వాక్రా మహిళ తన బయోమెట్రిక్ నమోదు ద్వారా రుణాలను పొందవచ్చని వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ ఆంజనేయులు పేర్కొన్నారు. పులివెందుల నియోజకవర్గం వేములలో శనివారం మహిళల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా రుణం పొందటానికి అర్హత అవసరం ఉన్న ఏ ఒక్క డ్వాక్రా మహిళను విస్మరించరాదని, అవసరం లేని వారికి రుణాలు నమోదు చేయరాదని డ్వాక్రా లీడర్లకు సూచించారు. డ్వాక్రా మహిళల జీవనోపాధి కోసం నిధులు సమీకరణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే రాయితీ పథకాలు అనుసంధానం చేయుటకు అన్ని ప్రభుత్వ శాఖలు, సమన్వయంతో సహకరిస్తారని తెలిపారు మండల వ్యాప్తంగా గొంది పల్లె వేముల కొత్త పల్లె, కనం కింద కొట్టాల గ్రామాల్లో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు నమోదు చేస్తున్న సూక్ష్మ రుణ ప్రణాళిక విధానాన్ని తనిఖీ చేశారు. డ్వాక్రా మహిళల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి మహిళకు సుస్థిర జీవనోపాధి ప్రణాళికను అమలు చేయుటకు బ్యాంకు లింకేజీ, నారిశక్తి, శ్రీనిధి, సామాజిక పెట్టుబడి నిధి, ఉన్నతి నిధులు, వాటర్షెడ్ నిధులు, సంఘనిధి, నిధులను అనుసంధానం చేసి జీవనోపాదుల కార్యక్రమం ఏర్పాటు చేయటమే ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు కమ్యూనిటీ కోఆర్డినేటర్లు డ్వాక్రా సంఘాలు గ్రామ సమాఖ్యలు మండల మహిళా సమాఖ్య పని చేస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ కోఆర్డినేటర్లు జయపాల్ జ్యోతి గంగరాజు, హరికృష్ణ నాగేశ్వరి గ్రామ సమాఖ్య అసిస్టెంట్లు నందిని పవన్ కుమార్ గంగులయ్య డ్వాక్రా లీడర్లు మహిళలు పాల్గొన్నారు.

## టీటీడీలో సాంకేతిక సేవలు, వసతి సౌకర్యాల్లో విస్తృత సంస్కరణలు

**- వేసవిలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు**

**- టీటీడీ ఈఓ జె.శ్యామలరావు**



**తిరుపతి, మే 24 (జనస్వరం) :** తిరుమలలో భక్తులకు మరింత పారదర్శకమైన సేవలు అందించేందుకు టీటీడీ పరిపూర్ణ చర్యలు చేపడుతోందని, ఇందులో భాగంగా సాంకేతిక సేవల విస్తరణ, అన్నప్రసాదాల నాణ్యత నియంత్రణ కోసం 'ఈ–ల్యాబ్' ఏర్పాటు చేస్తున్నట్టు టీటీడీ ఈఓ జె.శ్యామలరావు తెలిపారు. శనివారం అన్నమయ్య భవన్‌లో జరిగిన 'డయల్ యువర్ ఈవో' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, వేసవి వేడిమిని దృష్టిలో ఉంచుకుని తిరుమలలో విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు వివరించారు.

**వేసవి ఏర్పాట్లు :**
వేసవిలో భక్తులు ఎండకు ఇబ్బంది పడకుండా మాడ వీధుల్లో చలువ పందిళ్లు, కూల్ పెయింట్ లేపనాలు, నీటి పిచికారితో సహా పలు ఏర్పాట్లు చేశారు. రద్దీ ప్రాంతాల్లో తాగునీరు, మజ్జిగ పౌచుల పంపిణీ జరగుతుండగా, తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్‌లలో టోకెన్ల కోసం వేచి ఉన్న భక్తులకు నీరు, మజ్జిగ, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

**శ్రీవారి సేవ మరింత పటిష్టం :**
సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు శ్రీవారి సేవను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. నిపుణుల సలహాలతో సేవల నిర్వహణకు కార్యచరణ సిద్ధం చేయగా, ఎన్ఆర్ఐలకూ సేవలలో పాల్గొనడం కోసం ప్రత్యేక ఏర్పాట్లు జరుగుతున్నాయి. గోసేవను కూడా అందుబాటులోకి తీసుకొచ్చే ప్రణాళికలు ఉన్నాయి. గ్రూప్ లీడర్ల వ్యవస్థ ప్రవేశపెట్టి, వారిని శిక్షణ కార్యక్రమాల ద్వారా సమర్థులుగా తీర్చిదిద్దనున్నారు.

**తిరునామధారణ పునరుద్ధరణ, పట్టణ ప్రణాళిక విభాగం ఏర్పాటు :**
తిరునామధారణను తిరుమలలోని 18 ప్రాంతాల్లో తిరిగి ప్రారంభించారు. తిరుమల అభివృద్ధికి పట్టణ ప్రణాళిక శాఖను ఏర్పాటు చేశారు. మొదటి దశలో పద్మావతి అమ్మవారి ఆలయం (తిరుచానూరు), అమరావతి వేంకటేశ్వరస్వామి ఆలయం, నారాయణవనం, ఒంటిమిట్ట, నాగలాపురం తదితర ఆలయాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు. 45 విశ్రాంత భవనాలకు ఆధ్యాత్మిక పేర్లు నిర్ణయించగా, 42 భవనాలు పేర్లు మార్చాయి.

**టీటీడీలో ప్రక్షాళన కార్యక్రమాలు :**
భక్తులకు దర్శనం, వసతి, అన్నప్రసాదం, లడ్డూ ప్రసాదం విషయంలో సమూల మార్పులు తీసుకురావడంతో పాటు, తిరుమల అటవీ ప్రాంతంలో పచ్చదనం 68 శాతం నుంచి 80 శాతానికి పెరిగేలా చర్యలు చేపట్టారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో శ్రీ వేంకటేశ్వర ఆలయాల నిర్మాణానికి చంద్రబాబు 2014లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఇప్పటికే 8 రాష్ట్రాల్లో ఆలయాలు నిర్మించగా, మిగిలిన 15 రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖలు రాసి వారి ఆమోదానికి ప్రయత్నిస్తున్నారు.

**అన్యమతస్తులపై కఠిన చర్యలు :**
టీటీడీ విధానపరమైన నిర్ణయం మేరకు అన్యమత ఉద్యోగులపై చర్యలు తీసుకున్నారు. 29 మంది ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణకు బోర్డు ఆమోదం తెలిపింది. అలాగే, గత వైఖానస ఆగమ సలహా కమిటీ రద్దు చేసి కొత్త ఐదుగురు సభ్యుల కమిటీని నియమించారు.

**ఆహార నాణ్యతపై ప్రత్యేక దృష్టి :**
భక్తులకు మరింత నాణ్యమైన, రుచికరమైన భోజన సేవల కోసం బిగ్ క్యాంటీన్లు, జనతా క్యాంటీన్ల నిర్వహణను పేరొందిన సంస్థలకు అప్పగించనున్నారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నారు. 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో "ఈ–ల్యాబ్" ఏర్పాటు చేసి, పప్పు దినుసుల నాణ్యత కోసం రిలయన్స్ రిటైల్ సహకారంతో నిపుణుల సేవలు తీసుకుంటున్నారు.

**గోశాలల అభివృద్ధికి చర్యలు :**
గోవులకు నాణ్యమైన దాణా, పశుగ్రాసం అందించేందుకు టీటీడీ ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీఈ సత్యనారాయణ, పీఆర్వోలు రవి, నీలిమ, తదితర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కడపలో మహానాడు వాయిదా వేయాలి

**జాయింట్ కలెక్టర్‌కు వైసీపీ నేతల వినతి**




**పులివెందుల, మే 24 (జనస్వరం) :** దేశవ్యాప్తంగా కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో, కడపలో జరగనున్న మహానాడు సభను వాయిదా వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వైసీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషా శనివారం కడప కలెక్టరేట్‌కి వెళ్లి జాయింట్ కలెక్టర్ అతిథి సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పెద్ద ఎత్తున జరిగే సభలు, సమావేశాలు ఈ పరిస్థితుల్లో ప్రజలకు ప్రమాదకరమవుతాయని వారు అభిప్రాయపడ్డారు. ఈ మహానాడు సందర్భంగా కరోనా వ్యాపించే అవకాశం ఉన్నందున వాయిదా వేసుకోవాలని కోరారు. ప్రభుత్వం కూడా కరోనా మార్గదర్శకాలు జారీ చేసిందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, మాజీ టీటీడీ బోర్డు మెంబర్ యానాదయ, మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పోలీసు అనిల్ కుమార్, కార్పొరేటర్లు పాకా సురేష్, మహమ్మద్ షఫీ, బాలస్వామి రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, నాయకులు వినోద్ కుమార్, నిరంజన్ రెడ్డి, రఘునాథ్రెడ్డి, షఫీ, తదితరులు ఉన్నారు.

## స్వచ్ఛభారత్‌లో లారష్ ఉద్యోగులు



**యలమంచిలి, మే 24 (జనస్వరం) :** స్థానిక మున్సిపాలిటీ పరిధిలో కొత్తపాలెం గ్రామంలో శనివారం అచ్యుతాపురం లారెస్ కంపెనీ ఉద్యోగులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొని గ్రామంలో గల అన్ని వీధులు శుభ్రపరిచి ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ గ్రామమంతా శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో లారష్ ల్యాబ్ 1, 2 ఉద్యోగులు పాల్గొని వారు మాట్లాడుతూ ఉద్యోగంతో పాటు ఇటువంటి స్వచ్ఛంద సేవ చేయటం చాలా ఆనందకరంగా ఉందని, సమాజంలో అందరూ తమ పనితో పాటు కొంత సమయం సేవకు ఉపయోగించాలని వారు కోరారు.

## కామాంధుడి ఇల్లు కూల్చివేత



**పులివెందుల, మే 24 (జనస్వరం) :** వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం మైలవరం మండలం కంబాలదిన్నెలో 3 ఏళ్ల చిన్నారిని లైంగిక దాడి చేసి చంపిన కామాంధుడి ఇంటిని శనివారం గ్రామస్థులు కూల్చివేశారు. మైలవరంలో శుక్రవారం జరిగిన ఓ వివాహానికి తల్లి ఇద్దరి కూతుళ్ళతో వెళ్ళింది. అదే సమయలో ఆమె చిన్న కుమార్తె ఆడుకుంటున్న సమయంలో రహంతుల్లా అనే యువకుడు తాగిన మైకంలో ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేసి ఆపై హత్య చేసాడు. ఈ పరిణామక్రమంలో జమ్మలమడుగు మండలం మోరగుడిలో దూదేకుల రహమతుల్లా ఇంటిని పూర్తిగా జేసీబీతో నేలమట్టం చేశారు. ఇటువంటి వ్యక్తి తమ గ్రామంలో ఉండకూడదని, ఊరి నుంచి వారి కుటుంబాన్నీ వెలివేయాలని, అతడికి ఉరిశిక్ష వేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మహానాడు ఏర్పాట్లపై సమీక్షా సమావేశం

**హాజరైన రాష్ట్ర అధ్యక్షులు పల్లా, మంత్రులు, ఎమ్మెల్యేలు**



**పులివెందుల, మే 24 (జనస్వరం) :** కడపలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో శనివారం మహానాడు ఏర్పాట్లపై ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో పోలిట్ బ్యూరో సభ్యులు కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర నేతలు అనగాని సత్యప్రసాద్, సంధ్యా రాణి, బీద రవిచంద్ర, బీటీ నాయుడు, నిమ్మల రామానాయుడు, అమర్నాథ్ రెడ్డి, ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, కోడూరు రూపానంద రెడ్డి, బీసీ జనార్ధన్ తదితరులు పాల్గొని మహానాడు విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయంపై చర్చించారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడు సభకు ప్రతి నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఈ మహాసభను చారిత్రాత్మకంగా మార్చాలని వారు పిలుపునిచ్చారు.

# చినుకు రాలింది - వజ్రాల వేట మొదలైంది

**- వజ్రకరూరులో వర్షం కురిస్తే చాలు..**

**- జనాలు వేటలో మునిగి తేలుతున్నారు**



**పులివెందుల, మే 24 (జనస్వరం) :** వర్షం మొదలైనంత మాత్రానె వజ్రాల వేట కూడా మొదలవుతుంది. అది అనుకుంటే నమ్మలేనంత వింత, కానీ వజ్రకరూరులో ఇది ప్రతి సంవత్సరం కనిపించే నిజం. అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలో వర్షం పడగానే చిన్నా, పెద్దా తేడా లేకుండా వజ్రాల కోసం వేట మొదలవుతుంది. వర్ష జలాల్లో కొట్టుకుపోయిన వజ్రాల ఊహతో స్థానికులే కాదు, ఇతర ప్రాంతాల వారు కూడా వేలాది సంఖ్యలో పొలాల్లోకి చేరుకుంటున్నారు.

**వర్షం అనగానే అదృష్ట ఆశ :**

ఈ ప్రాంతానికి వర్షం కురిస్తే, వజ్రాలు మట్టిపైకి వచ్చేస్తాయని స్థానికుల నమ్మకం. అందుకే వర్షం పడిన వెంటనే వజ్రాల వేట ప్రారంభమవుతుంది. బైకులు, ఆటోలు, కార్లు.. వాహనాల ఏరు బేరుతో వజ్రకరూరు గ్రామం కళకళలాడుతోంది. సెలవులు కూడా ఉండటంతో వేటకు వచ్చిన వారి సంఖ్య మరింతగా పెరిగింది. కొన్ని కుటుంబాలైతే పిల్లలతో సహా వచ్చి పొలాల్లో వెతుకుతూ, భోజనాలు అక్కడే సిద్ధం చేసుకుంటూ రోజంతా గడుపుతున్నారు.

**అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న వేటగాళ్లు :**

గత ఐదు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడుతోంది. దీంతో వజ్రాల కోసం వేటకు వచ్చిన వారి సంఖ్య లక్ష్యంగా పెరుగుతోంది. వజ్రకరూరుతో పాటు కర్నూలు, గుంతకల్లు, బళ్లారి, హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి, పొలాల్లో వజ్రాల కోసం అన్వేషణ చేస్తున్నారు. "ఒక్క వజ్రం దొరికితే చాలు... జీవితమే మారిపోతుందన్న నమ్మకమే వేటకు ప్రేరణ" అంటున్నారు అక్కడి ప్రజలు.

**ఇద్దరికి వజ్రాలు దొరికిన వార్తతో ఉత్సాహం :**

ఇటీవల రెండురోజుల క్రితం ఇద్దరికి వజ్రాలు దొరికినట్టు ప్రచారం జరుగుతోంది. ఆ వార్తతో మరింత ఉత్సాహంతో ప్రజలు గుంపులుగా వజ్రాల వెతుకులాటలో మునిగిపోతున్నారు. కొన్ని రోజుల క్రితం ఓ వ్యక్తికి వజ్రాలు దొరికిన తర్వాత అతను వాటిని నగదుగా మార్చాడని, అదే ఇప్పుడు అందరికీ స్ఫూర్తిగా మారిందని స్థానికులు చెబుతున్నారు.

**పర్యావరణం తట్టుకోలేనంతగా మారింది :**

ఒక్కసారి వర్షం పడితే చాలు, వజ్రాల ఆశతో పొలాల వైపు పరుగులు పెడుతున్న ప్రజలతో వజ్రకరూరు మారుమూల ప్రాంతం ఒక పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది. అయితే ఇలా పెద్ద ఎత్తున ప్రజలు రావడం వల్ల పర్యావరణంపై ప్రభావం పడే అవకాశమూ లేకపోలేదని, ఈ వేటపై నియంత్రణ అవసరమని కొందరు అంటున్నారు.

**విజ్ఞులు హెచ్చరిక :**

ఇలాంటి వేటలు ఎప్పటికీ నమ్మకంగా ఉండవని, వజ్రాలు దొరికినా అవి నిజమైనవో కాదో పరీక్షించడం కష్టం అవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ స్థానికులు మాత్రం వర్షం పడిన ప్రతీసారి అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నాన్ని కొనసాగిస్తున్నారు.

## మహానాడు విజయంలో భాగస్వాములవ్వాలి



**పులివెందుల మే 24 (జనస్వరం) :** ఈ నెల 27, 28, 29 తేదీలలో కడపలో నిర్వహించే మహా నాడుకు బ్రాహ్మణలు అధిక సంఖ్యలో హాజరై మహానాడు విజయంలో భాగస్వాములవ్వాలని బ్రాహ్మ ణ చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు రఘునాథరావు ప్రసాదరావు కోరారు. వారు మాట్లాడుతూ 43 సంవత్సరాల తరువాత తెలుగుదేశం ప్రస్థానంలో మొదటిసారిగా కడపలో ఈ కార్యక్రమం నిర్వ హించడం కడప జిల్లా ప్రజల అదృష్టమన్నారు. కడపలో జరిగే కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా బ్రాహ్మణలకు ఒక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బ్రాహ్మణ అభ్యున్నతికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టిన ఘనత తెలుగుదేశం పార్టీదేన్నారు. రానున్న కాలంలో బ్రాహ్మణ సంక్షేమం కోసం మన పిల్లల ఉపాధి ఉద్యోగాలు కోసం సమస్యల పరిష్కారం కోసం కలసి కట్టుగా నిలబడ వలసిన బాధ్యత మన అందరిపై ఉందని నేటి మహానాడు విజయంతో అది స్ఫూర్తిగా నిలవాలని కోరారు.

## తుడా అభివృద్ధికి అంతా కలసి పనిచేద్దాం


**పరిచయ సమావేశంలో తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి**



**తిరుపతి, మే 24 (జనస్వరం) :** తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) అభివృద్ధికి అందరూ కలసి కట్టుగా పనిచేద్దామని తుడా చైర్మన్ సి.దివాకర్ రెడ్డి అధికారులకు, సిబ్బందికి పిలుపునిచ్చారు. శనివారం ఉదయం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో పరిచయ సమావేశం నిర్వహించారు. తుడా పరిధిలో అభివృద్ధి పనులు, ఆయా విభాగాల అధికారుల విధులు తదితరాలను ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య వివరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తుడా పరిధిలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయం చేసుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. తుడా పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి పనులు, లే అవుట్ల ఏర్పాటు పారదర్శకంగా జరిగేలా అధికారులు జాగ్రత్తగా పని చేయాలన్నారు. తుడా నిధులు ఎక్కడా దుర్వినియోగం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. తుడాలో జరుగుతున్న అభివృద్ధి ఇతర సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అందరూ పనిచేయాలన్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న లే అవుట్లలో కూడా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అధికారులు, సిబ్బందికి తాను ఎప్పుడూ అందుబాటులో ఉంటానని, అందరూ నిబద్ధతతో విధులు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సెక్రెటరీ డాక్టర్ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, ఈ.ఈ. రవీంద్ర, ప్లానింగ్ ఆఫీసర్ దేవికుమారి, ఉద్యానవన శాఖాధికారి మాలతి, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ మృతదేహానికి మాజీ ముఖ్యమంత్రి కిరణ్ నివాళి

**సంతాపం తెలిపిన పూర్వ విద్యార్థులు**



**తిరుపతి, మే 24 (జనస్వరం) :** తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల, గోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలలో దాదాపు 30 ఏళ్లుగా కామర్స్ అధ్యాపకుడిగా పనిచేసి పదవీ విరమణ పొందిన రఘునాథరెడ్డి శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి, చిత్తూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ అమాస రాజశేఖర్ రెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, బీజేపీ నాయకులు నవీన్ కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్ రెడ్డిలు హాజరై రఘునాథరెడ్డి పార్థివ దేహానికి నివాళి అర్పించారు. విషయం తెలుసుకున్న పూర్వ విద్యార్థులు ఆయన స్వగృహం చేరుకొని ఆయన మృద్దేహానికి సంతాపం తెలియజేసి కన్నీటిపర్యంతం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేలమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి వారిని ఉన్నత వ్యక్తులుగా తీర్చిదిద్దిన రఘునాథరెడ్డి అకాలంగా మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుండాల గోపీనాథ్, మల్లికార్జున రావు, తొండమనాడు సుబ్రమణ్యం రెడ్డి, ఉమ్మడి జయప్రకాష్, మల్లారపు రవిప్రసాద్, వాసు, లెక్చరర్ రవి, ప్రసాద్, కుమార్ కొట్టే, సుబ్రహ్మణ్యం రెడ్డి, దేశ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక శోభ పెంచడమే లక్ష్యం

**గోవింద నామస్మరణ యాత్రలో గుండాల గోపినాథ్**



**తిరుపతి, మే 24 (జనస్వరం) :** నగరంలో శనివారం గోవింద నామస్మరణలతో మారు మ్రోగింది.. మరింత ఆధ్యాత్మిక శోభను పెంచడానికి ఇటు స్థానికల్లోనూ అటు భక్తుల్లోనూ భక్తి భావాన్ని మరింత పెంచాలనే సంకల్పంతో స్థానిక భజన మండలి కళాకారులు ప్రతి శనివారం నగరంలో గోవింద నామ సంకీర్తనలను చేపడుతున్నారు. భజన మండలి కళాకారుల అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి నేతృత్వంలో కళాకారులు ఉదయం 5 గంటల నుంచి దాదాపు 100 మంది భజన మండల కళాకారులు, భక్తులు తిరుణామాలు ధరించి సాంప్రదాయ వస్త్రాలతో మంగళ వాయిద్యాలు తప్పెట తాళాలతో నగరంలో గోవింద నామ సంకీర్తనలు ఆలపించారు. ఈ సందర్భంగా నగర సంకీర్తన మండలి సభ్యులు మాట్లాడుతూ శనివారం రోజు శ్రీనివాసునికి ఎంతో ప్రీతికరమైన రోజని గుర్తు చేశారు. అందుకే ఆయనను స్మరిస్తూ నేడు భారీ సంఖ్యలో కళాకారులు తరలివచ్చి నగర సంకీర్తనలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ నగర సంకీర్తన అనంతరం భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుండాల గోపీనాథ్, రాజశేఖరరెడ్డి, మునినాథ రెడ్డి, వాసుదేవరెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యం రెడ్డి, వాసు, విజయ భాస్కర్ రెడ్డి, విక్రమ్ స్వామి, నరసింహారెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, మురళి రెడ్డి, బాబు, విగ్రహాల కళ్యాణి, పార్వతి, జయమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

## జనసేన క్రియాశీలక సభ్యత్వ కిట్లు పంపిణీ

**- జనసేన పార్టీ నాయకులు శ్రీనివాస రాజు ఆధ్వర్యంలో**

**రాజంపేటలో ఉత్సాహంగా సభ్యత్వ కార్యక్రమం**



**రాజంపేట, మే 23 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాజంపేటలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంటు జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరు శ్రీనివాస రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం స్థానిక జనసేన కార్యాలయం.. యల్లటూరు భవన్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీనివాస రాజు మాట్లాడుతూ "జనసేన పార్టీకి దశాబ్ద కాలంగా గ్రామస్థాయిలో అంకితభావంతో పనిచేస్తున్న జన సైనికుల సంక్షేమం కోసం క్రియాశీలక సభ్యత్వ కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. ఈ సభ్యత్వంతో ప్రతి కార్యకర్తకు ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమా మరియు ప్రమాదాల్లో గాయపడిన వారికి రూ.50,000 వరకు వైద్య ఖర్చులు అందే విధంగా ఏర్పాటు చేయడం పార్టీ తాపత్రయాన్ని ప్రతిబింబిస్తోంది" అన్నారు. క్రియాశీలక సభ్యత్వాలను విజయవంతంగా ప్రచారం చేసి ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని, వారు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి చేస్తున్న సేవలు అభినందనీయం అని పేర్కొన్నారు. "పవన్ కళ్యాణ్ భావజాలాన్ని నమ్మి, ఆయన నిజాయితీపై విశ్వాసంతో పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు జనసేన గుండెల్లో స్థానం ఉంటుంది. పార్టీ కోసం చేసే ప్రతి త్యాగాన్ని మేము గుర్తించి గౌరవిస్తాం" అని స్పష్టంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండల, పట్టణ, పంచాయతి స్థాయి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు పాల్గొన్నారు.

## మంత్రి టీజీ భరత్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని




**విజయవాడ, మే 23 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** కర్నూలులోని క్రికెట్ గ్రౌండ్ పరిశీలన నిమిత్తం వెళ్లిన ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి శనివారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్‌కు మంత్రి టీజీ భరత్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ సాదరంగా స్వాగతం పలికారు. టీజీ వెంకటేష్ పుష్పగుచ్ఛం అందజేసి ఆత్మీయంగా ఆహ్వానించగా, మంత్రి భరత్ శాలువా కప్పి సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును కూడా శాలువాతో సత్కరించారు. ఈ మౌలిక ఆదరణతో శుభకార్యాల నిమిత్తం చేపట్టిన క్రీడా మైదానాల అభివృద్ధికి మరింత ప్రోత్సాహం లభించనుందని నేతలు అభిప్రాయపడ్డారు.

## ఎన్టీఆర్ జయంతిని ఆత్మగౌరవ దినోత్సవంగా ప్రకటించాలి

**- బి.వి. రామ్ డిమాండ్**

**- 27న బొబ్బిలిపులి ఆడియో విడుదల**



**విశాఖపట్నం, మే 24 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి. రామ్ ఎన్టీఆర్ జయంతిని "తెలుగువారి ఆత్మగౌరవ దినోత్సవంగా" రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. శనివారం విశాఖపట్నంలోని హెూటల్ మేఘాలయలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ఈ మేరకు సోమవారం లోగా ప్రభుత్వం జీఓ విడు దల చేయాలని కోరారు. ఇప్పటి వరకు ఏ జిల్లాలో జరిగిన మహానాడులోనూ దీనిపై తీర్మానం లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఈ ఏడాది అయినా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని, ఇది మొత్తం తెలుగు ప్రజల కోరికగా పేర్కొన్నారు. "తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఎన్టీఆర్ నిలబెట్టారు, తెలుగుజాతి ప్రతిష్టను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన వ్యక్తి చంద్రబాబు" అని బి.వి.రామ్ కొనియాడారు. తాను ఎన్టీఆర్ వీరాభిమాని అని, చంద్రబాబుపై కూడా అపార గౌరవం ఉన్నదని తెలిపారు. ఇకపై తన జీవితం మొత్తాన్ని ప్రజల కోసం అంకితమిస్తున్నానని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం సాగిస్తానని స్పష్టం చేశారు. 1982లో తెలుగు వారిని 'మద్రాసీ' అని, 'ఇడ్లీ-సాంబార్' అంటూ హేళన చేసిన సందర్భాన్ని గుర్తుచేసిన రామ్, అప్పుడు ఆ అవమానాన్ని భరించలేక ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారని, ఇందిరాగాంధీకి ఎదిరించి తెలుగువారి పౌరుషాన్ని చాటారని వివరించారు. పార్టీలకు అతీతంగా ఇప్పటికీ ఎన్టీఆర్‌ను గౌరవించడం అనేది ఆయన స్ఫూర్తికి నిదర్శనమని పేర్కొన్నారు.

**27న "బొబ్బిలిపులి" ఆడియో విడుదల :**

బి.వి.రామ్ తన రాజకీయ జీవన ప్రయాణం ఆధారంగా రూపొందిన బొబ్బిలిపులి ఆడియో ఆల్బమ్‌ను ఈనెల 27న ఉదయం 9 గంటలకు విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. అన్యాయాన్ని తట్టుకోని, అక్రమాలపై కఠినంగా ఎదిరించే వ్యక్తిగా తనను ప్రజలు చూడాలని ఆకాంక్షించారు. "వంద మంది దాడితో బి.వి. రామ్‌ను హతమార్చారు. ఇప్పుడు నేను కొత్తగా ప్రజల కోసం మానవుడిగా, అన్నగా, తమ్ముడిగా, ప్రతి ఇంటి పెద్ద కొడుకుగా బొబ్బిలిపులిగా పునర్జన్మ పొందుతున్నాను" అంటూ ఎన్టీఆర్ సాక్షిగా ప్రమాణం చేశారు. తన నూతన పోరాటం ప్రజా ప్రగతి కోసం అని, 'తెలుగు శక్తి' మార్గాన్ని మలిచే దిశగా కార్యాచరణ కొనసాగుతుందని వెల్లడించారు.

## రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో క్రికెట్ గ్రౌండ్స్ అభివృద్ధే లక్ష్యంగా ఏసీఏ

**- ఎంపీ కేశినేని శివనాథ్**

**- కర్నూలు మునగాలపాడులో క్రికెట్ గ్రౌండ్‌ను పరిశీలించిన ఎంపీ, మంత్రి, అధికారులు**



**విజయవాడ/కర్నూలు, మే 23 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** రాష్ట్రంలో ప్రతి నియోజకవర్గంలో క్రీడా మైదానాలను అభివృద్ధి చేయడం ద్వారా యువతలో క్రీడాప్రతిభను వెలికి తీసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో "క్రీడాంధ్రప్రదేశ్" లక్ష్యంగా రాష్ట్రం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. శనివారం కర్నూలు జిల్లా మునగాలపాడులో ఉన్న క్రికెట్ గ్రౌండ్‌ను పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి ఎంపీ శివనాథ్ సందర్శించారు. జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా క్రికెట్ మైదానం స్థితిగతులను వారికి వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ, "క్రికెట్ మైదానాల మౌలిక వసతుల లేమితో యువత క్రీడల పట్ల ఆసక్తి తగ్గుతోంది. అందుకే ప్రతి నియోజకవర్గంలో మౌలిక వసతులతో కూడిన క్రీడా మైదానాలను నిర్మించడమే మా లక్ష్యం. మునగాలపాడులోని ఈ మైదానాన్ని త్వరలోనే అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగలమని నమ్మకంగా ఉన్నాం" అన్నారు. కర్నూలుకు ఈ మైదానం కొత్త కాంతి కలిగిస్తుందని అభిప్రాయపడ్డ ఆయన, ఎన్డీయే కూటమి ప్రభుత్వం క్రీడా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని పేర్కొన్నారు. యువతను క్రీడలవైపు ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కర్నూలు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవింద రెడ్డి, కార్యదర్శి రమేష్, ఇతర సభ్యులు, ప్రభుత్వ అధికారులు తదితరులు ఉన్నారు.

## గ్రంథాలయంలో 7 అద్భుతాలపై విద్యార్థులకు అవగాహన





**పెదపాడు, మే 24 (జనస్వరం) :** పెదపాడు శాఖా గ్రంధాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో శనివారం విద్యార్థులకు ఆధునిక ప్రపంచంలోని ఏడు అద్భుతాలపై అవగా హన కల్పించారు. ఈ శిబిరంలో రిసోర్స్ పర్సన్ ఆరవల్లి రంగారావు ముఖ్య వక్తగా పాల్గొని, ప్రస్తుత శతాబ్దంలో నిర్మించబడిన సాంకేతిక ప్రగతికి ప్రతీకలైన ఏడు అద్భుతాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ, ఆస్ట్రేలియాలోని సిడ్నీ నృత్య-నాటిక ప్రదర్శనశాల, ఇంగ్లాండ్-ఫ్రాన్స్‌ల మధ్య సముద్రంలో నిర్మించిన ఛానల్ టన్నెల్, జపాన్‌లోని హన్ సాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం, ధ్వనికంటే వేగంగా ప్రయాణించే కాంకార్డ్ విమానం, ఈజిప్ట్‌లోని అశ్వాన్ డామ్, అమెరికాలోని సియర్స్ టవర్, అలాగే కెన్నడీ స్పేస్ సెంటర్ వంటి నిర్మాణాలు మానవ సృజనాత్మకతకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు 'గురుదక్షిణ' అనే బాలల కథల పుస్తకంలోని 'అందని సహాయం' అనే కథను చదివారు. కథపై చర్చ జరిపి పాఠాలు నేర్చుకున్నారు. అనంతరం విద్యార్థులు పుస్తక సమీక్షలు చేశారు. అంతేకాక, ఆట విడుపులో భాగంగా విద్యార్థులకు 'కోకో' అనే ఆట గురించి వివరించి ఆడించారు. శారీరక చైతన్యం, సహకారంతో పనిచేసే నైపుణ్యం పెంపొందించేందుకు ఈ ఆట దోహదపడిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రంధాలయ అధికారి దుగ్గిపోగు జాన్ బాబు సమర్థవంతంగా నిర్వహించారు. మొత్తం 13 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న వారికి స్నాక్స్ పంపిణీ చేశారు.

WWW.JANASWARAM.COM

జనస్వరం

## హనుమాన్ జయంతి సందర్భంగా ఉండ్రాజవరంలో భారీ అన్న సమారాధన



**దెందులూరు, మే 24 (జనస్వరం) :** మండలంలోని ఉండ్రాజవరం గ్రామంలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఉదయం నుంచి స్వామివారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. తమలపాకులతో అభిషేకం చేశారు. అనంతరం ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## పోతునూరు గ్రంథాలయంలో ఉత్సాహంగా వేసవి శిక్షణ తరగతులు






**దెందులూరు, మే 24 (జనస్వరం) :** వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శనివారం పోతునూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులు గ్రంథపాలకులు గురిందపల్లి రాంబాబు ఆధ్వర్యంలో నీతి కథలు, పుస్తకాలు చదవడం, చదరంగం, క్యారమ్స్ ఆటలు ఆడుతూ ఉత్సాహంగా గడిపారు. విద్యార్థులకు స్నాక్స్ అందించారు.

## ఏపూరి గ్రామంలో ఘనంగా దాసాంజనేయ స్వామి జయంతి వేడుకలు





**దెందులూరు, మే 24 (జనస్వరం) :** పెదపాడు మండలం ఏపూరు గ్రామంలోని శ్రీ సీతారామ సమేత దాసాంజనేయ స్వామి వారి హనుమాన్ జయంతి, వజ్రోత్సవ వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక కూటమి నాయకుల ఆధ్వర్యంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కి ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. అర్చనల అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌కి ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామ సీత, పెదపాడు మాజీ ఎంపీపీ మోరు శ్రావణి, అప్పనవిడు తెలుగుదేశం పార్టీ నాయకులు హనుమాన్ జంక్షన్ అప్పన వీడు ఆంజనేయ స్వామి ఆలయ దేవస్థానం కమిటీ చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, సహా పలువురు స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అచ్యుతాపురంలో ప్రారంభమైన మెగా క్లీనింగ్ డ్రైవ్



**యలమంచిలి మే 24 (జనస్వరం) :** అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఏపీఐఐసీ కార్యాలయం వద్ద యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మెగా క్లీనింగ్ డ్రైవ్ శనివారం ఉదయం ప్రారంభం అయింది. దీనిలో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వాహనాల నుంచి ఖాళీ వాటర్ బాటిల్స్, ప్యాకెట్స్ బయట వెయ్య వద్దన్నారు. 300 మంది వాలంటీర్లు ఈ డ్రైవ్లో జనసేన, టీడీపీ, బీజేపీ, లారస కంపెనీ యాజమాన్యం పాల్గొన్నారు.

# ఫ్లోరైడ్ రక్కసికి చెక్..



- విపీఆర్ అమృతధార ద్వారా శుద్ధజల సౌకర్యాలు
- బుచ్చి, కొడవలూరు, విడవలూరులో వాటర్ ప్లాంట్లను ప్రారంభించిన వేమిరెడ్డి దంపతులు

**కోవూరు, మే 24 (జనస్వరం) :** ఉదయగిరి ప్రాంతంలో ఫ్లోరైడ్ ప్రభావంతో తీవ్రంగా కిడ్నీ వ్యాధులు తలెత్తిన ఘటనల నేపథ్యంలో సురక్షిత తాగునీరు అందించేందుకు విపీఆర్ ఫౌండేషన్ ప్రారంభించిన 'విపీఆర్ అమృతధార' కార్యక్రమం విశేష ఆదరణ పొందుతోంది. ఈ క్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శనివారం బుచ్చి రెడ్డిపాలెం మండలంలోని మునలపూడి, కొడవలూరు మండలంలోని ఊటుకూరు, విడవలూరు మండలంలోని పల్లెపాలెం గ్రామాల్లో వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలు మేళతాళాలతో ఘనస్వాగతం పలికారు. ఎంపీ, ఎమ్మెల్యే కలిసి తొలిసారి గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా బ్రహ్మరథం పట్టారు. విపీఆర్ అమృతధార గురించి వివరించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి 2017లో ఉదయగిరిలో ఫ్లోరైడ్ నీటి కారణంగా ప్రజలు తీవ్రంగా బాధపడుతుండటాన్ని చూశాకే విపీఆర్ అమృతధార పథకానికి బీజం వేసినట్లు గుర్తుచేశారు. నెల్లూరు జిల్లాలో ఇప్పటి వరకు 175కుపైగా వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అలాగే, ఐదు నియోజకవర్గాల్లో దివ్యాంగులకు ఉచిత ట్రై సైకిళ్లు పంపిణీ చేశామని, అవసరం ఉన్నవారు నెల్లూరులోని విపీఆర్ కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చాలా గ్రామాల్లో తాగునీరు అందుబాటులో లేకపోవడం చూశానని, ఎన్నికల తరువాత వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తానన్న హామీ నెరవేరుస్తున్నానన్నారు. బుచ్చి మండలం మునలపూడిలో ప్లాంట్ కోసం స్థలం ఇచ్చిన పాత్రికేయుడు మురళిని ప్రత్యేకంగా అభినందించారు. పాత్రికేయులు విమర్శలతో పాటు ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. తాజాగా నియమితులైన టీడీపీ మండల అధ్యక్షులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వహణ బాధ్యతను విపీఆర్ ఫౌండేషన్ స్వీకరించింది. నీటిని పొదుపుగా వాడుకోవాలన్న ఆమె సూచన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి, సచివాలయ సిబ్బంది పెన్షన్, రేషన్ కార్డుల దరఖాస్తుల విషయంలో చొరవ చూపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బుచ్చి ఎంపీపీ మన్నేపల్లి శ్రీనివాసరావు, మునలపూడి సర్పంచ్ వెంకట రమణారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి, తహసిల్దార్ అంబటి వెంకటేశ్వర్లు, బుచ్చి మునిసిపల్ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, టీడీపీ రూరల్ మండల అధ్యక్షులు బెజవాడ జగదీష్, గౌరవ అధ్యక్షులు టంగుటూరి మల్లారెడ్డి, నేతలు బత్తుల హరికృష్ణ, సూరారా శ్రీనివాసులురెడ్డి, కొడవలూరు అధ్యక్షులు నాప వెంకటేశ్వర్లు నాయుడు, తహసిల్దార్ స్ఫూర్తి రెడ్డి, ఎంపీడీఓ సూర్య కుమారి, విడవలూరు టీడీపీ అధ్యక్షులు శ్రీహరి రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి, ఆవుల వాసు, అడపాల శ్రీధర్ రెడ్డి, పాశం శ్రీహరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్యాలు వృథా.. లక్ష్యాలు చెద..

- నిర్మాణ దశలోనే ఆగిపోయిన కొండవంచుల రహదారి
- ప్రజలు రాకపోకల్లో ఇక్కట్లు.. స్పందించని అధికార యంత్రాంగం



**చింతపల్లి, మే 24 (జనస్వరం) :** మండలంలోని పెద్దగడ్డ నుంచి సాడిక, పారికల, పెద్దూరు మీదుగా కొండవంచుల గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సుమారు 7 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ప్రారంభం పలికినప్పటికీ, గుద్దేదారుడు కేవలం కొంత వరకు మాత్రమే పనులు కొనసాగించి నిర్మాణాన్ని నిలిపి వేయడంతో ప్రజలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఎర్రబొమ్మల పంచాయతీ పరిధిలోని గ్రామ ప్రజలు అత్యవసర సమయంలో చింతపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేందుకు, నిత్యవసర సరుకుల కోసం చింతపల్లి, నర్సీపట్నం వంటి పట్టణాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఈ రహదారి పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉండటంతో, పరిస్థితి మరింత దుర్భరంగా మారనుంది. ప్రజలు స్థానిక అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలు మార్లు వినతులు చేసినా ఇప్పటికీ స్పందన లేకపోవడం ప్రజల్లో ఆగ్రహానికి దారి తీస్తోంది. ఈ రహదారి లేకపోవడం వల్ల వైద్యసేవలు, విద్య, రవాణా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది మా గ్రామాల జీవనాడి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం చర్యలు తీసుకొని రహదారి నిర్మాణాన్ని పూర్తిచేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి ఖర్చయిన నిధులు వృథా కాకుండా చూడాలని, రహదారి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

## కొల్లేరులో గ్రామాల అభివృద్ధితో పాటు పర్యాటకాన్ని సైతం మరింత అభివృద్ధి చేస్తాం

**దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వెల్లడి**



**ఏలూరు రూరల్, మే 24 (జనస్వరం) :** కొల్లేరు గ్రామాల ప్రజల సమస్యలను పరిష్కరించి, వారి గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు కొల్లేరులోని మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రాన్ని కూడా మరింత అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని కూడా ప్రోత్సహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. రూరల్ మండలంలోని మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రం వద్ద అర్బన్ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ మాధవాపురం పక్షుల ఆవాస కేంద్రం వద్ద గల చెరువులో నిత్యం నీరు ఉండడం వల్ల గట్లు పూర్తి స్థాయిలో బలహీనపడి అధ్వాన స్థితికి చేరుకున్నాయని, తద్వారా పక్షుల ఆవాస కేంద్రానికి సందర్శన కోసం వచ్చే పర్యాటకులు కూడా తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని, అందుకోసం అర్బన్ ద్వారా నిధులను కేటాయించి మాదవాపురం పక్షుల ఆవాస కేంద్రం వద్ద గట్లను బలోపేతం చేయడంతో పాటు యగ్మొంటెన్ స్టాండ్లను కూడా ఏర్పాటు చేసే విధంగా అటవీ శాఖ వన్యప్రాణి సంరక్షణ విభాగం నియమాలకు లోబడి రూ అర్బన్ నిధుల ద్వారా పనులు కేటాయించడం జరిగిందని, అదే విధంగా వర్షాలు సమీపిస్తున్న నేపథ్యంలో పనులను కూడా సత్వరమే పూర్తి చేసేలా గుత్తేదారు సంస్థ ప్రతినిధులను కూడా ఆదేశించడం జరిగిందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు.

## ఎండీయూ ద్వారా బియ్యం పంపిణీ కొనసాగించాలి

**పాడేరు ఎమ్మెల్యేకు యూనియన్ మండల అధ్యక్షుడు సింహాచలం వినతిపత్రం సమర్పణ**



**చింతపల్లి, మే 24 (జనస్వరం) :** రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి ఎండీయూ (మండల డిపో యూనిట్) ఆధ్వర్యంలో ఇంటింటికీ బియ్యం పంపిణీని నిలిపివేయాలన్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, ఎండీయూ యూనియన్ మండల అధ్యక్షుడు వనము సింహాచలం, ఉపాధ్యక్షుడు యు.పూర్ణ రవిశంకర్ నేతృత్వంలో పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎండీయూ పథకం పేద, బడుగు, బలహీన వర్గాలకు వరంగా మారిందని పేర్కొన్నారు. నేరుగా లబ్ధిదారులకు బియ్యం అందేలా, ఎటువంటి మధ్యవర్తిత్వం లేకుండా ఈ విధానం సమర్థవంతంగా అమలైందన్నారు. ప్రభుత్వం తాత్కాలికంగా ప్రవేశపెట్టిన కొత్త విధానాలు ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండీయూ విధానాన్ని కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ పథకం పేద ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తుందని స్పష్టం చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాల్ని అమలు చేస్తూ, ప్రజలకు మేలు చేసే పథకాలను రద్దు చేయాలనే ఉద్దేశంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండీయూ యూనియన్ నాయకులు జాన్, నీలకంఠం, సుందర్, సిమోన్, రవి, లావణ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

## పరోక్షసేవగా.. నందీశ్వరస్వామికి విశేషార్చన

**పరోక్షసేవలో పాల్గొన్న 36 మంది భక్తులు**



**శ్రీశైలం మే 24 (జనస్వరం) :** శ్రీశైలభ్రమరాంభమల్లికార్జున స్వామివార్ల సన్నిదానంలో త్రయోదశి ఘడియలను పురస్కరించుకుని గురువారం నందీశ్వరస్వామి (శనగలబసవన్న)వారికి విశేషార్చనలు జరిగాయి. లోకకల్యాణం కోసం ప్రతి మంగళవారం, త్రయోదశి రోజున దేవస్థానం సేవగా ఈ కైంకర్యం జరిపిస్తారు. ప్రతి త్రయోదశి రోజులలో భక్తులు నందీశ్వర స్వామి వారి పూజను పరోక్షాసేవగా జరిపించుకునే అవకాశం దేవస్థానం భక్తులకు కల్పించినట్లు కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ పరోక్షా సేవను శనివారం 36 మంది భక్తులు జరిపించుకున్నారని తెలిపారు. ఈ పరోక్షాసేవను తెలుగు రాష్ట్రాల నుండి మాత్రమే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు ఈ సేవను చేయించుకున్నారు. ఈ విశేషార్చనలో ముందుగా అర్చక వేదపండితులు లోకక్షేమాన్ని కాంక్షిస్తూ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ జరిపించి శాస్త్రోక్తంగా నందీశ్వరస్వామికి మల్లికా గుండములోని శుద్ధజలంతో అభిషేకం నిర్వహించి స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. పురుషాసుక్తం, వృషభసూక్తం మొదలైన వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా ఈ విశేషాభిషేకాన్ని జరిపించారు. అనంతరం నందీశ్వరస్వామివారికి నూతన వస్త్ర సమర్పణ, విశేష పుష్పఅర్చనలు నిర్వహించి నానబెట్టిన శనగలను నందీశ్వరస్వామికి సమర్పించారు. త్రయోదశి రోజున నందీశ్వర స్వామివారి పరోక్షాసేవకు భక్తులు ఆన్ లైన్ ద్వారా రూ.1,116లను సేవా రుసుంగా చెల్లించాల్సి ఉంటుంది. భక్తులు సేవా రుసుమును www.srisailadevasthanam.org లేదా aptemples.ap.gov.in ద్వారా చెల్లించవచ్చని తెలిపారు.


## కళారాధనలో.. (భరతనాట్యం) నృత్యప్రదర్శన




**శ్రీశైలం, మే 24 (జనస్వరం) :** శ్రీశైలదేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా శనివారం ఏర్పాటు చేసిన సంప్రదాయ భరత నాట్యం నృత్యప్రదర్శన భక్తులకు విశేషంగా అలరించింది. శ్రీ స్వామి అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరగాలని, ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణలో భాగంగా ఆలయ దక్షిణ మాడవీధిలోని ధర్మపథం వేదికపై కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన కృష్ణన్ వారి బృందం వారిచే సంప్రదాయ భరతనాట్యం నృత్యప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ నృత్యప్రదర్శనలో పలు భక్తి గీతాలకు అష్టకష్టాలకు పలువురు కళాకారిణిలు నృత్యప్రదర్శన చేశారు. ఈ నిత్యకళారాధనలో ప్రతిరోజు హరికథ, బుర్రకథ, సాంప్రదాయ నృత్యం, వాయిద్య సంగీతం, భక్తిరంజని కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## రంగా సేవలు అన్ని వర్గాలకీ అనుస్మరణీయం

- రాజకీయ రంగులు అవసరం లేదు
- కామయ్యపాలెంలో వంగవీటి రంగ విగ్రహాన్ని ఆవిష్కరించిన పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు



**బర్రింకాలపాడు/జీలుగుమిల్లి, మే 24 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** జీలుగుమిల్లి మండలంలోని కామయ్యపాలెం గ్రామంలో గ్రామస్థులు ఏర్పాటు చేసిన వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని శనివారం పోలవరం శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ "వంగవీటి రంగ ఒక కాపు నాయకుడిగా మాత్రమే కాకుండా సమాజంలో అన్ని కులాల బాధలను తీర్చేందుకు పోరాడిన సాహసి. ఆయన్ను కుల గీతలతో పరిమితం చేయడం అన్యాయం. అందుకే రంగా సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలి, ఆయన త్యాగాలను స్మరించుకోవాలి" అని అన్నారు. విగ్రహ ఆవిష్కరణను కొందరు కావాలనే రాజకీయం చేయాలని చూస్తున్నారని, అలాంటి వారికి కాలమే సమాధానం చెబుతుందని, రంగా వంటి మహనీయుల త్యాగాలకు రాజకీయ రంగులు అవసరం లేదని ఎమ్మెల్యే స్పష్టంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, సీనియర్ నేత కరాటం ఉమా, జీలుగుమిల్లి జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కూటమి నాయకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సత్యసాయి జిల్లా టీడీపీ మహానాడు

**పుట్టపర్తి, మే 24 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** సత్యసాయి జిల్లా కేంద్రం కప్పలబండ వద్ద శుక్రవారం నిర్వహించిన హిందూపురం పార్లమెంట్ స్థాయి టీడీపీ మహానాడు పసుపు రంగు సముద్రంగా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడు అంజినప్ప అధ్యక్షతన నిర్వహించిన ఈ మహానాడుకు రాష్ట్ర బీసీ, చేనేత సంక్షేమ శాఖ మంత్రి సవిత, ఎంపీ పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఇతర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, టీడీపీ కార్యకర్తల సంక్షేమానికి పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, నేత నారా లోకేష్ చేస్తున్న కృషిని కొనియాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలు అనేక కష్టాలు ఎదుర్కొన్నారని, ప్రజావేదికను కూల్చిన దినం నుంచే విధ్వంస పాలన ప్రారంభమైందన్నారు. అమరావతిని మూడుగా చీల్చిన పాలనకు ప్రజలు గుణపాఠం చెబుతూ ఈ ఎన్నికల్లో టీడీపీకి 163 స్థానాలు కట్టబెట్టారని తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర యావత్ రాష్ట్రానికి నూతన ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నారు. కార్యకర్తల త్యాగంతోనే కూటమి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. టీడీపీ కార్యకర్తలకు రూ.100 చెల్లింపు సభ్యత్వంతో రూ.5 లక్షల బీమా పొందే అవకాశం కల్పించడం దేశంలో ఇదే మొదటిసారని పేర్కొన్నారు. ఈ మహానాడు వేదికలో పలు తీర్మానాలు ఆమోదించబడ్డాయి. హంద్రీనీవా 9వ ప్యాకేజీ కింద నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని, 193 చెరువులకు నీరు అందించే రెండు రిజర్వాయర్ల భూసేకరణకు రైతులకు పరిహారం చెల్లించాలని, బుక్కపట్నం చెరువు కింద నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని తీర్మానించారు. అలాగే గత ప్రభుత్వం కాలంలో టీడీపీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మాజీ మంత్రి డాక్టర్ రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో మహానాడు ఏర్పాట్లు ఘనంగా జరిగాయి. కార్యకర్తల కోసం విశాల భోజనశాల, త్రాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేశారు.



## వికసిత భారతాన.. స్వర్ణాంధ్ర సాధన

- కలిసికట్టుగా సాధిద్దాం
- 2029 నాటికి పేదరికం లేని రాష్ట్రంగా ఏపీ
- పీ-4 అమలుతో ఆ లక్ష్యాన్ని అందుకుంటాం
- అమరావతి, తిరుపతి, కర్నూలుకు విశాఖ మోడల్!
- టెక్నాలజీ అభివృద్ధికి శీఘ్రగతిన ప్రణాళికలు
- డిజిటల్ మౌలిక కల్పనల్లో ఆదర్శంగా నిలిచాం
- కుటుంబానికో పారిశ్రామికవేత్త.. మా నినాదం
- 2047నాటికి భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ
- నీతీ ఆయోగ్ సమావేశంలో చంద్రబాబు వెల్లడి
- సీఎం బ్లూప్రింట్ ప్రజంటేషన్‌కు మోదీ ప్రశంస



**న్యూఢిల్లీ, మే 24 (జనస్వరం) :** స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్లు పూర్తి చేసుకునేనాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాలకు అనుగుణంగా నడిచేందుకు... ఇందులో దేశానికే మార్గదర్శకంగా నిలిచేందుకు ఆంధ్రప్రదేశ్ సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 'స్వర్ణాంధ్ర విజన్ 2047' ద్వారా ఆవిష్కరణలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలతో జాతీయ అభివృద్ధికి ఏపీ దోహద పడుతుందని తెలిపారు. 'వికసిత్ భారత్ 2047' సాకార పథంలో ఆంధ్రప్రదేశ్ ముందుందని పేర్కొన్నారు. 2.4 ట్రిలియన్ డాలర్ల ప్రగతి లక్ష్యంతో రాష్ట్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంలో భాగంగా 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పీ 4 ద్వారా ఈ లక్ష్యాన్ని అందుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలోని 'భారత మండపం'లో శనివారం ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన జరిగిన నీతీ ఆయోగ్ 10వ పాలక మండలి సమావేశంలో సీఎం చంద్రబాబు ఏపీ అభివృద్ధిపై నివేదిక సమర్పించారు. వృద్ధిరేటు, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, రెండు, మూడో శ్రేణి నగరాల అభివృద్ధి వంటి వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో టెక్నాలజీ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను ప్రస్తావించారు. డిజిటల్ గవర్నెన్స్‌లో గూగుల్ ఏఐ టెక్నాలజీ వినియోగిస్తున్నామన్నారు. ప్రతి కుటుంబానికీ ఫ్యామిలీ బెనిఫిట్ డిజిటల్ పాస్‌బుక్ సృష్టిస్తున్నామని చంద్రబాబు వివరించారు. టాటా ఇన్నొవేషన్ హబ్, ఏఐ ఆధారిత పాలన ద్వారా ఏపీ స్టార్టప్‌లకు, ఉద్యోగ సృష్టికి మార్గదర్శకంగా మారిందని తెలిపారు. సర్క్యులర్ ఎకానమీ, అభివృద్ధి వికేంద్రీకరణ, మిషన్ కర్మయోగి వంటి కార్యక్రమాల ద్వారా సమగ్రాభివృద్ధిని ఆంధ్రప్రదేశ్ సాధిస్తోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ గత పదేళ్లలో పదో స్థానం నుంచి నాలుగో స్థానానికి చేరుకుందని, త్వరలోనే మూడో స్థానానికి వెళ్తుందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తంచేశారు. డిజిటల్ ఇండియా, జీఎస్టీ, స్టార్టప్ ఇండియా, పీఎం గతిశక్తి, జల్‌జీవన్ మిషన్ వంటి జాతీయ సంస్కరణలు అభివృద్ధికి దోహదం చేశాయని వివరించారు. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని ఏపీ ప్రభుత్వం డిజిటల్‌గా ట్రాక్ చేస్తోందన్నారు. 'వన్ ఫ్యామిలీ-వన్ ఆంత్రప్రెన్యూర్' కార్యక్రమం ద్వారా నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు కృషి చేస్తున్నామని తెలిపారు. 175 నియోజకవర్గాల్లో 175 ఎంఎ సఎంఈ పార్కులు, వన్ డిస్ట్రిక్ట్- వన్ పార్క్‌ను ప్రవేశపెడుతున్నామని చంద్రబాబు వివరించారు.

**'ఆపరేషన్ సిందూర్' మోదీ ఘనతే.. :**
పహల్గాం ఉగ్రదాడిలో మరణించినవారికి నీతీ ఆయోగ్ సమావేశంలో సీఎం చంద్రబాబు నివాళులు అర్పించారు. మోదీ ధీరత్వం, అద్భుత నాయకత్వంతోనే 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమైందని కొనియాడారు. యుద్ధ వాతావరణం నెలకొన్న సంక్షోభ సమయంలో ప్రధాని మోదీ ధైర్యంగా నాయకత్వం వహించారని సీఎం ప్రశంసించారు.

**బాబు బ్లూ ప్రింట్‌పై పీఎం ప్రశంసలు :**
నీతీ ఆయోగ్ సమావేశంలో ఏపీ అభివృద్ధికి సంబంధించిన అంశాలను బ్లూ ప్రింట్ (ప్రణాళిక) ద్వారా సీఎం చంద్రబాబు వివరించారు. దీనిపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. ఇతర రాష్ట్రాలు కూడా ఆంధ్రప్రదేశ్ అమలు చేస్తున్న సంస్కరణలను అధ్యయనం చేయాలని సూచించారు. చంద్రబాబు రూపొందించిన ప్రణాళిక ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉంటుందని మోదీ కొనియాడారు.

**ఇవే మూడు మంత్రదండాలు :**
2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యాన్ని వేగవంతంగా సాధించేందుకు జీడీపీ, జనాభా నిర్వహణ, టెక్నాలజీపై దృష్టి సారించాలని సీఎం చంద్రబాబు అన్నారు. దీనికోసం మూడు సబ్ గ్రూప్‌లను రాష్ట్రాలతో ఏర్పాటు చేయాలని నీతీ ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో సీఎం చంద్రబాబు ప్రతిపాదించారు. కేంద్రప్రభుత్వం, నీతీ ఆయోగ్, రాష్ట్రప్రభుత్వాలు ఈ సబ్ గ్రూప్‌లో కలిసి పని చేయాలని ఆయన సూచించారు. మొదటి సబ్‌గ్రూప్ జీడీపీ అభివృద్ధిని పెంచేందుకు, రెండవ సబ్‌గ్రూప్ జనాభా నిర్వహణకు, మూడో సబ్‌గ్రూప్ టెక్నాలజీ ఆధారిత పరిపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు.

**మొదటి సబ్‌గ్రూప్ :** పెట్టుబడులు, ఉత్పత్తి, ఎగుమతులు, పెంపొందించేందుకు, ఉపాధి కల్పన అవకశాలు కల్పించేందుకు పీపీపీ ప్రాజెక్టులకు కేంద్రం వయబులిటీ గ్యాప్ నిధులను సమకూర్చేందుకు పని చేయాలి.

**రెండో సబ్‌గ్రూప్ :** వృద్ధాప్యం, తక్కువ సంతాన సాఫల్యం వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు దేశం సిద్ధమయ్యేందుకు తోడ్పాడాలి. దేశంలోని జనాభాను సదావకాశంగా భావించాలి.

**మూడో సబ్‌గ్రూప్ :** ఏఐ, క్వాంటమ్ కంప్యూటింగ్, డ్రోన్లు, రియల్‌టైమ్ డిజిటల్ ప్లాట్‌ఫాంలు, పౌరుల కేంద్రీకృత పాలనపై దృష్టి సారించాలి.

## రికార్డులు తిరగరాసేలా యోగా డే

- ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకూ 2.5 లక్షల మంది భాగస్వామ్యం
- 26.5 కి.మీ. పొడవునా 127 కంపార్టుమెంట్లు
- కంపార్టుమెంటుకు 1,000 మంది
- ప్రత్యామ్నాయంగా ఏయూలో వేదిక
- ప్రజా ప్రతినిధులు, అధికారులతో ఇన్‌చార్జి మంత్రి, హెూం మంత్రి సమీక్ష



**విశాఖపట్నం, మే 24 (జనస్వరం) :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను వచ్చే నెల 21న అట్టహాసంగా, గత రికార్డులు తిరగరాసేలా నిర్వహించాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనితతో కలిసి శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ యోగా వేడుకల్లో నగర పౌరులు, ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, నేవీ, కోస్టుగార్డు, యోగా అసోసియేషన్లు, వాకర్స్ అసోసియేషన్లు, వ్యాపారులు, విభిన్న ప్రతిభావంతులు, కార్మికులు...అందరూ పాల్గొనేలా అధికారులు చూడాలన్నారు.

**కంపార్టుమెంటుకు 1,000 మంది... :**
యోగా వేడుకలకు సంబంధించి వివరాలను కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సమావేశంలో వివరించారు. గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించాలంటే భాగస్వాములంతా ఒకే వేదికపై కొనసాగాలని, మధ్యలో ఎక్కడా కనెక్టవిటీ తెగిపోకూడదన్నారు. అందువల్ల ఆర్కే బీచ్ రోడ్డులో కాళీమాత గుడి నుంచి భీమిలి వరకూ 26.5 కి.మీ. పొడవునా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. ప్రధాన వేదిక కాళీమాత గుడి నుంచి వైఎంసీఏ వరకూ ఉంటుందని, దీంట్లోనే ప్రధానమంత్రి, గవర్నర్, ముఖ్యమంత్రి, కేంద్ర, రాష్ట్ర మంత్రులు పాల్గొంటారన్నారు. ఆర్కే బీచ్ నుంచి భీమిలి వరకు 26.5 కి.మీ. పొడవునా 127 కంపార్టుమెంట్లు ఏర్పాటుచేస్తున్నామని, ప్రతి కంపార్టుమెంటులో 1,000 మంది పాల్గొంటారన్నారు. ప్రతి కంపార్టుమెంటుకు ఇన్‌చార్జి, 10 మంది వలంటీర్లు ఉంటారన్నారు. ప్రతిచోట చిన్న వేదిక, మైక్ సిస్టమ్, అభ్యాసకులు కనిపించేలా ఎల్‌ఈడీ స్క్రీన్లు పెడతామన్నారు. తొమ్మిది కిలోమీటర్ల మేర రోడ్డుకు ఇరువైపులా, 18.5 కి.మీ పొడవున రోడ్డుకు ఒకవైపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రధాన రహదారిపై 1.24 లక్షల మందిని, మరొక 25 అదనపు వేదికల్లో మిగిలిన వారిని భాగస్వామ్యం చేస్తామన్నారు. ఆర్గానిక్ బ్రేక్ ఫాస్ట్ పెట్టేందుకు యోచిస్తున్నట్టు కలెక్టర్ వివరించారు. జిల్లాలో వివిధ యోగా అసోసియేషన్లతో సమన్వయం చేసుకుని మూడు దశల్లో శిక్షణ అందిస్తామని, ఇప్పటికే టీవోటీ, మాస్టర్ ట్రైనీలను గుర్తించామని, వారి ద్వారా మండల, గ్రామ స్థాయిల్లో శిక్షణ ఇస్తామన్నారు.

**వర్షం వస్తే ప్రత్యామ్నాయంగా ఏయూలో వేదిక :**
ఒకవేళ జూన్ 21న వర్షం వస్తే కార్యక్రమం నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ప్రధాని, గవర్నర్, సీఎం, మంత్రులు, ఇతర ప్రముఖులు పది వేల మంది యోగాసనాలు వేసేలా షెడ్లు వేస్తున్నామని, ఇవి జూన్ 12వ తేదీకల్లా అందుబాటులోకి వస్తాయన్నారు. వర్షం లేకపోతే వుడా పార్కు సర్కిల్ నుంచి చినవాల్తేర్ రోడ్డు, ఏయూ అవుట్‌గేటు మార్గం గుండా ఇంజనీరింగ్ కళాశాలకు అనుసంధానం చేస్తామన్నారు. సమీక్షలో ప్రభుత్వ విప్‌లు పి.గణబాబు, వేపాడ చిరంజీవిరావు, ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, పి.విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్, ఏపీ కో-ఆపరేటివ్ ఆయిల్‌సీడ్స్ ఫెడరేషన్ చైర్మన్ గండి బాబ్జీ, ఎన్టీఆర్ వైద్యసేవా వైస్ చైర్మన్ సీతంరాజు సుధాకర్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీసీపీలు అజిత వేజెండ్ల, మేరీ ప్రశాంతి, డీఆర్వో భవానీశంకర్, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్‌మాధుర్, నేవీ, కోస్టుగార్డు, జిల్లాలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు బాంబు బెదిరింపు

- క్షుణ్ణంగా సోదాలు నిర్వహించిన బాంబు, డాగ్ స్క్వాడ్‌లు
- అటువంటిదేమీ లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నసిటీ పోలీసు, జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

**విశాఖపట్నం, మే 24 (జనస్వరం) :** ముంబై నుంచి విశాఖపట్నం వచ్చే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18620)లో బాంబు ఉన్నట్టు శనివారం అజ్ఞాత వ్యక్తి నుంచి ఫోన్ కాల్ రావడంతో కలకలం రేగింది. రైలు ప్లాట్‌ఫామ్‌కు చేరిన వెంటనే బాంబు, డాగ్ స్క్వాడ్‌లు క్షుణ్ణంగా తనిఖీ చేసి బాంబు లేదని నిర్ధారించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. వివరాల్లోకి వెళితే...విజయవాడ బీసెంట్‌రోడ్డులో బాంబు పెట్టినట్టు శనివారం బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. అక్కడ సోదాలు జరుగుతుండగానే ముంబై నుంచి విశాఖ వచ్చే ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌కు కూడా బాంబు బెదిరింపు రావడంతో జీఆర్పీ, రైల్వే రక్షణ దళం (ఆర్పీఎఫ్)తోపాటు నగర పోలీసు శాఖ అప్రమత్తమయ్యాయి. షెడ్యూల్ ప్రకారం ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ (18620) ఉదయం 10.50 గంటలకు విశాఖ రైల్వే స్టేషన్‌కు చేరాల్సి ఉండగా, మూడు గంటలు ఆలస్యంగా మధ్యాహ్నం 1.48 గంటల ప్రాంతంలో వచ్చింది. బాంబు, డాగ్ స్క్వాడ్‌లు హుటాహుటిన తనిఖీలు చేపట్టాయి. సెకండ్ సిట్టింగ్ (ఎస్-2) కోచ్‌లో సీటు నంబర్ 80 వద్ద అనుమానాస్పద బ్యాగ్‌ను రైల్వే పోలీసులు గుర్తించారు. వెంటనే బాంబు స్క్వాడ్ తమ వద్ద ఉన్న పరికరాలతో తనిఖీ చేయగా....ఆ బ్యాగ్‌లో బాంబు లేదని తేలింది. దీంతో పోలీసులు బ్యాగ్‌ను తెరిచి చూడగా దుస్తులు, సబ్బులు, ఆధార్‌కార్డు లభ్యమయ్యాయి. ఆధార్ కార్డులోని వివరాలను బట్టి ఉత్తరప్రదేశ్‌కు చెందిన శ్రీరామ్ తివారీదిగాగుర్తించారు.

ప్రయాణికుల ఆందోళన

రైలు ఆగిన వెంటనే బాంబు, డాగ్ స్క్వాడ్‌లు, పోలీసు బలగాలు కోచ్‌లలోకి ప్రవేశించి సోదాలు నిర్వహిస్తున్న సమయంలో బాంబు బెదిరింపు వచ్చిందని తెలుసుకున్న ప్రయాణికులు.. భయాందోళనకు గురై లగేజీ పట్టుకుని స్టేషన్ బయటకు పరుగులు తీశారు.

## చింతపల్లి కోర్టును సందర్శించిన జిల్లా జడ్జి

**పర్యటనకు ఘన స్వాగతం.. ఆధునీకరణకు శ్రీకారం**



**చింతపల్లి, మే 24 (జనస్వరం) :** ఉమ్మడి విశాఖపట్నం జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్న శెట్టి రాజు శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా కోర్టు మేజిస్ట్రేట్ న్యాయమూర్తి ధరణి ఆయనకు పుష్పగుచ్ఛంతో ఘన స్వాగతం పలికారు. జిల్లా న్యాయవ్యవస్థ భాగంగా జరిగిన ఈ పర్యటనలో జడ్జి చిన్న శెట్టి రాజు కోర్టు కార్యకలాపాలను సమీక్షించారు. కేసుల విచారణ ప్రగతిని, న్యాయసేవల ప్రాప్యతను, అలాగే కోర్టు ఎదుర్కొంటున్న సవాళ్లను దగ్గర నుండి పరిశీలించారు. అనంతరం కోర్టు సిబ్బంది, స్థానిక న్యాయవాదులతో మంతనాలు జరిపారు. న్యాయవ్యవస్థను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా మార్చే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చిన జడ్జి ప్రజలకు న్యాయసేవలు సులభంగా అందుబాటులోకి రావాలనే దృక్పథంతోనే ఈ పర్యటనను చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ధరణి మాట్లాడుతూ జిల్లా జడ్జి పర్యటన మా న్యాయస్థానానికి గొప్ప ప్రోత్సాహాన్ని అందించింది. ప్రజలకు వేగంగా సమర్థవంతంగా న్యాయం అందించేందుకు మేము నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ పర్యటన నేపథ్యంలో చింతపల్లి న్యాయస్థానానికి ఆధునిక సాంకేతిక వసతులు, మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చే అవకాశముందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ బాబు, ఎస్ఐ వెంకటేశ్వరరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## కన్నుల పండుగగా వీరాంజనేయస్వామి రథోత్సవం





**గుంటూరు, మే 24 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** హనుమజ్జయంతి సందర్భంగా శ్రీనివాస రావుతోట శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో వెలసిన శ్రీ సువర్చలా సమేత శ్రీ వీరాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను శనివారం ప్రత్యేక ఒంటె వాహనంపై మంగళ వాయిద్యాల మధ్య నగర పురవీధుల్లో ఊరేగించారు. శ్రీనివాసరావుతోట, వడ్డెర గూడెం మీదుగా రామనామ క్షేత్రం మీదుగా అత్యంత వైభోపేతంగా ఊరేగింపు సాగింది. ఊరేగింపు ఆద్యంతం మహిళా భక్తులు స్వామి వారికీ హారతిలిస్తూ ముందుకు సాగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. మహిళలు నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంది. ఆలయ పూజారి శ్రీమాన్ కోగంటి పవన్ కుమార్ నేతృత్వంలో స్వామి వారికీ ప్రత్యేక అర్చనలు నిర్వహిం చారు. ఊరేగింపు తదితర కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, తోట వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షులు పుప్పాల నాగయ్య పర్యవేక్షించారు. నారదాసు కోటేశ్వర రావు, తోట శంకరరావు, నరసింహారావు, రాయల్, కోటేశ్వరరావు, రాసంశెట్టి శ్రీను, ఆంజినే యులు, కేశవదాసు, ఆళ్ళ హరి, మెహన్ రావ్, కనకమాలక్ష్మి, రాజేశ్వరి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## 27న 'బొబ్బిలిపులి' ఆడియో విడుదల



**గాజువాక, మే 24 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ నటించిన 'బొబ్బిలిపులి' చిత్రం ఆడియో విడుదల ఈ నెల 27న ఉదయం 9 గంటలకు జరగనుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం గాజువాకలో జరిగిన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస రావు సోదరి పులిచర్ల రాజేశ్వరి చేతుల మీదుగా 'బొబ్బిలిపులి' ఆడియో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బి.వి.రామ్ మాట్లాడుతూ, "అన్యాయాన్ని సహించను, అక్రమాలకు తలొగ్గను. ఎదుటివారు ఎవరికైనా సరే ప్రశ్నించగల సాహసంతో ముందుకు సాగుతున్నాను. ప్రజా ప్రగతికే నా పోరాటం. నన్ను హతమార్చాలని వంద మంది దాడికి దిగినా, నేను నిలబడుతాను. ఇప్పుడు నేను ప్రజలందరికీ అన్నగా, ప్రతి ఇంటి పెద్ద కొడుకుగా, మానవతావాదిగా – బొబ్బిలిపులిగా, ఎన్టీఆర్ సాక్షిగా ప్రమాణం చేస్తున్నాను," అని పేర్కొన్నారు. ఆడియో పోస్టర్ ఆవిష్కరించిన పులిచర్ల రాజేశ్వరి మాట్లాడుతూ, "బొబ్బిలిపులి పాట ఎంతో అద్భుతంగా ఉంది. రామ్ మరొకసారి ఎన్టీఆర్ స్ఫూర్తిని గుర్తు చేశారు. ఈ చిత్రానికి శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను," అన్నారు.

**50వ పెళ్లిరోజు శుభాకాంక్షలు :**
విశాఖపట్నంలోని గ్రీన్ సిటీ ప్రాంతంలో నివసించే వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీరమాచినేని వెంకట కృష్ణారావు, రాజ్యలక్ష్మి దంపతులకు 50వ పెళ్లిరోజు సందర్భంగా బి.వి.రామ్ తరఫున తెలుగు శక్తి సంస్థ శుభాకాంక్షలు తెలిపింది.

## ఊపందుకున్న మామిడి వ్యాపారం

**బేనీషా రకం టన్ను ధర రూ.20-30వేలు**



**బంగారుపాళ్యం, మే 24 (జనస్వరం) :** బంగారుపాళ్యం మార్కెట్ యార్డులో మామిడి కాయల వ్యాపారం ఊపందుకుంది. శనివారం తీసుకొచ్చిన మామిడి కాయల్లో టేబుల్ రకాలైన బేనీషా టన్ను ధర రూ.20-30వేల మధ్య, ఖాదర్ రకం రూ.28-29వేల మధ్య, పుల్లూర కలర్ రకం రూ.12-16వేల మధ్య, జ్యూస్‌కి తరలించే పుల్లూర రకం రూ.8వేలు, నాటురకం టన్ను రూ.7వేల ధర పలికింది.